

నందం రామారావు

"ఏవండీ ?" అన్నది సుమతి భర్తకు కాఫీ యిస్తూ

కాఫీ అందుకుంటూ ఏవిటన్నట్టుగ చూశాడు వేణు

"ఇవేళ ఆఫీసునుంచి పెందరాడే వొచ్చేయండి ఫస్ట్ షో కెడదాం"

"ఇవేళా ! బావుంది ఈ రోజు శనివారం తెలుసా ?"

"తెలుసునండి ఎప్పుడూ వుండే దేగా ఆ పేకాట 'వీడని బంధాలు' ఈ రోజుతో వెళ్ళిపో తుందట ఏ రోజు కా రోజు ఆ సినిమాకి వెడదామంటూ గడిపారు మరి, ఇప్పుడేమో ఆ సినిమా వెళ్ళిపోతోంది నే.ఎభిమానించే నా హీరోయిన్ సినిమా చూడకపోతే ఎలాగండి పైగా, నేనా సినిమా చూళ్ళేదని తెలిస్తే నా హీరోయిన్ తెగ బెంగపడిపోతుంది నా సినిమా చూశావా ? అంటూ రేపో ఎల్లుండో ఫోన్ కూడా చేస్తుంది"

భార్య మాటలకు వేణు నవ్వుతూ వుండి పోయాడు

"మీకలా నవ్వులాటగానే వుంటుంది ఈ ఒక్క శనివారానికే మీరు పేకాడ్డం మానెయ్యలేరే ? మరి, ఆ సినిమా చూడకపోతే నాకెలా వుంటుంది"

"ఇదిగో సుమతీ ! మీ హీరోయిన్ నీకేం ఫోన్ చెయ్యదుగానీ, ఒకవేళ ఫోన్ చేస్తే, ఆ సినిమా దేశంలో ఎక్కడాడుతున్నా నిన్ను తీసుకెళ్ళి చూపిస్తాను సరేనా ? ఎంచక్కా హాయిగా భోజనం చేసి పడుకో"

"అవును మరి, నేనీ యింట్లో ఒక్కదాన్నే పడుకుంటే మీరు తెల్లవార్లూ పేకాడి, తెల్లారి ఇంటికొస్తారు ఏవిటో బాబూ మీ వరసలు నాకేం నచ్చడంలేదు"

"శ్రీమతీ ! ఓ పని చేద్దామా ?"

"మీరు ఒకటి కాదు వంద చెయ్యండి నేను మాత్రం ఆ సినిమా కెళ్ళవలసిందే"

"ఇదిగో, నువ్విలా మీ హీరోయిన్ పిక్చర్ ఫెయిలయినట్టు ముఖం పెట్టకు నువ్వు సాయంత్రం నేరుగా పిక్చర్కెళ్ళిపో నేనీ లోపల రెండు రౌండ్సాడి, పిక్చర్ వొదిలే టైమ్కు థియేటర్కొచ్చి నిన్ను కలుసుకుంటాను ఓకె ఇద్దరి పనులూ జరిగిపోతాయ్"

"ఆఁ! మనుషుల్ని బోల్తాకొట్టించడంలో మీకు మీరేసాటి"

"మరైతే నేను ఆఫీసుకెడతాను అవునూ ! మరి, మన మామూలు సంగతేవిటి ?" అంటూ వేణు, భార్యను దగ్గరకు తీసుకోబోయాడు

"ఇవాళ శనివారం నిషేధం ఐనా, ముద్దు పెట్టుకోవడానికి శనివారం గుర్తురాదు కాబోలు పేకాటకైతే గుర్తుంటుంది" అంటూ సుమతి భర్తను సతారంగా విడిపించుకుంది

"ఏవిటో నీ లెక్కలు సరే కానిమ్మ దేవి ఈ 'ముద్దు' కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యడం రేపటికి వాయిదా వేసితిని" అని అంటూ వరండాలో వున్న స్కూటర్ దగ్గరకెళ్ళాడు వేణు

వేణు ఆఫీసుకెళ్ళగానే సుమతి వంటరిదై పోయింది. అప్పటికి టైమ్ ఉదయం పదిగంటలే ఐనా, ఇక చెయ్యవలసిన పనంటూ ఏమీలేకుండా పోయింది !

సుమతికి పెళ్ళయ్ దాదాపు పదేళ్ళు దాటింది మంచి భర్త, మంచి వుద్యోగం, అంతకుమించి, మంచి మనసూ, ఎందరికోగాని లభ్యంకాని అనువైన సంసారం

కానీ, ఇంత పెద్ద ఇంట్లో సందడనేదే లేదు చిరుపాదాల మువ్వల సవ్వడిలేదు

భర్త ఆఫీసుకు వెళ్ళగానే వొంటరిదై, దిగులుగా ఏం తోచక, పిల్లల క్యాలండర్లకేసి చూస్తుండి పోయేది ! రాత్రయితే చాలు – దీపాల వెలుగులో బోసినవ్వులతో మురిపించే పిల్లలు లేక, అర్థరాత్రి స్మశానంలో వైరాగ్యంతో తిరుగాడుతున్న జీవిలా వుండిపోయేది !

సుమతి స్త్రీ సహజమైన కోరికతో, ఆశతో పిల్లల కోసం ఎందరో దేవుళ్ళకు పూజలు చేసింది మ్రొక్కుకుంది !

పూజలకూ, మ్రొక్కుబడులకూ డబ్బైతే ఖర్చయింది గానీ పిల్లలు పుట్టలేదు

